## ఉద్యోగం పురుష లక్షణం.... (ఒంగోలు కథలు -14) - by పార్థు



ఈ కథ కీ ఒంగోలు కీ ఎలాంటి సంబంధము లేదు, అయినా ఆ జ్ఞాపకాల దొంతర లోనే దీన్నీ ఇరికించాలని ఇక్కడ రాయటం జరిగింది.

కథ లోకి వస్తే , 1995 నాటి మాట.

ఇంకో నెల రోజుల్లో ప్రాజెక్టు చెయ్యడానికి ఎక్కడో చోట చేరాలి అన్నప్పటి నుండి మొదలయ్యాయి ఆరాలు, ఆదుర్దాలు.

"వరప్రసాద్ కి CMC లో వచ్చేసిందిట, వాళ్ళ మామయ్య వల్ల. ప్రాజెక్టు అయిపోవడం తోనే జాబ్ లోకి కూడా తీసేసుకుంటారుట" మోసుకొచ్చాడు ప్రతాప్ గాడు,

"స్టార్టింగే 6 వేలు అంట.." మంట కూడా పెట్టాడు.

మాకు ప్రాజెక్టు రాలేదన్న కసి కన్నా, వాడి కి ఏకంగా జాబే వచ్చింది అన్న న్యూసే బాధించడం మొదలెట్టింది.

"మా బాబాయి గారి కి చెప్పా, ECIL లో చూస్తున్నారు, ఆల్మోస్ట్ వచ్చినట్టే "చెప్పా

"నాకు సిటీస్ లో ఎవరూ లేరు, అర్థం కావడం లా, ఏం చెయ్యాలో" వాపోయాడు రాధా గాడు

"ఒక పని చేస్తే, మా బావ ఫ్రెండు (మల్లిఖార్జున) Sriven లో పని చెస్తున్నాడు, అతని ద్వారా ప్రయత్నిద్దామా?" ఉప్పందించాడు ప్రతాప్ గాడు.

"సరే, అయితే అందరం Hyd వెళ్ళి, 2, 3 రోజులు తిరిగైనా ఏదో ఒకటి సెటిల్ చేసికొద్దాం రా" అన్నాడు రామయ్య గాడు

"ఏరా! నిజం గా ప్రాజెక్టు కోసమేనా?" నిలదీసా వాడ్ని.

"పుణ్యం, పురుషార్థం, రెండూనూ, వినటమే కాని ఎప్పుడు చూడలేదురా RTC X roads."..చెప్పాడు చిన్నగా

"ఎవరైనా టాంక్ బండో, బిర్లా మందిరో చూడాలని తపిస్తారు ఈ RTC గోలేంట్రా బాబు" అన్నాడు విషయం తెలియని అశ్విన్

"మరి అక్కడే కదా "దేవి" వుంది" అన్నాడు వీడు.

"మీ అత్త కూతురా, పాత లవరా" మళ్ళీ అడిగాడు విషయం తెలియని సన్నాసి

"వాళ్ళే కాదు సుదర్శన్, సంధ్య కూడ వున్నారు" మరింత క్లూ ఇచ్చాడు పీడు

అస్సాం లాంటి అటవీ ప్రాంతం నుండి వచ్చిన అశ్విన్ కి అర్ధం కాలా.

"అవి థియేటర్లు రా.." చెప్పాడు వేణుగోపాల్ గాడు

"ఏంటి, అక్కడ కూడా చెయ్యొచ్చా MCA వాళ్ళు ప్రాజెక్టు లూ" ఉత్సాహం కనపరచాడు అశ్విన్

"MCA, MS అన్న పట్టా పట్టింపులేకుండా అందరికి ఒకే రకం గా పట్టం కట్టేది అక్కడే" చెప్పాడు చేతి మీద వెంట్రుకులు బలం గా పీక్కుంటూ రామయ్య గాడు

"మీరు నోరు మూసుకుని కూర్చోండి, ఇవతల నేను ప్లాన్ వేస్తున్నా" అరిచాడు ప్రతాప్

ప్లాన్ చెప్పడం పూర్తి అయింది..

* * *

అందరం పెట్టె లుచ్చుకుని Hyd లో దిగాం.

"ఈవెనింగ్ 3 pm కి మళ్ళీ లకడీకపూల్ బస్ స్టాప్ లో కలవాలి, 5pm కల్లా "మల్లి" బయటకొస్తా అన్నాడు ఆఫీసు అయిపోయి." చెప్పాడు ప్రతాప్

ఎవరి చుట్టాలిళ్ళకి వాళ్ళు వెళ్ళారు. రాధా గాడు, రామయ్య లాడ్జి తీసికున్నారు

అనుకున్న సమయానికే మల్లి బయటకొచ్చాడు...విషయాన్ని విన్నవించాం మరో సారి.

దగ్గర లో వున్న ఇరానీ హోటెల్ కి తీసికెళ్ళాడు

కప్పు పక్కన పెడుతూ, చిన్న గా దగ్గి, గొంతు సవరించుకున్నాడు...

"ఓస్ ఇంతేనా!!, ఈ మాత్రం దాని కే మీరు గోదావరి ఈదుకుంటూ (జెనరల్ లో వచ్చాం లెండి) వచ్చేయ్యాలా? మా మానేజర్ తో చెప్పి, మీ అందరికీ సాయంత్రం కల్లా ప్రాజెక్టు లేం ఖర్మ, ఏకంగా ఉద్యోగాలే ఇప్పించేస్తా.......... " అని చెపుతాడేమో అని మేమంతా ఆశ గా చూసాం.

ఒక్క క్షణం నిశ్శబ్దం..

"మీరందరూ ముందు మంచి shoe లు కొనుక్కోవాలి.." చెప్పాడు, మా అందరి కాళ్ళ వంకా కంపరం గా చూస్తూ

"ప్రాజెక్ట్ కీ, చెప్పుల కి ఏంటి సార్ సంబంధం? అయినా ఇవి షోలాపూర్ చెప్పులు సార్, మా అమలాపురం తిరనాళ్ళ లో కొన్నాను" నిలేసాడు నిస్సంకోచం గా వేణు గాడు

"ఇంకా అయిపోలేదు ఆగు, టై లు కొనుక్కుని, టిప్ టాప్ గా తయారవ్వాలి లేదా మైత్రి వనం లో మొక్కల్లాగే మిగిలి పోతారు" భయపెట్టాడు చిక్కడపల్లి మల్లి.

"మేం ఆల్రెడీ వచ్చేసాం ......, కాబట్టి నువ్వు చచ్చినట్టు ఇచ్చితీరాల్సిందే నీ కంపెనీ లో ప్రాజెక్టు" అని ఇలా కమాండింగ్ గా రాయకూడదు,

ఇక్కడ resume అంటారు, ఫార్మాట్ ఇస్తాను అలా ప్రిపేర్ చేయించుకుని, ఓ 10 కాపీలు పైన పట్టుకుని రేపొద్దున్నే రండి" చెప్పాడు టీ జుర్రుకుని, బస్సెక్కి జారుకుని.

* * *

"అంటే.., ఇదే మాటర్ ని మీ అందరి ఊర్లు, పేర్లు మార్చి టైపు చెయ్యాలా?" అడిగాడు అనుమానంగా కంప్యూటర్ సెంటర్ ఓనరు ఖైరతాబాద్ లో.

"నే చెప్పానా, ఇలాంటి మతలబులు ఇక్కడ చాలా ఈజీ గా చేసేస్తారు అని" పని అయినందుకు ఆనందపడిపోతూ ప్రతాప్

"నా దగ్గర మామూలు పేపర్ లు లేవు, బాండ్ షీట్లే వున్నాయ్, రేట్ ఎక్కువతుంది" చెప్పాడు తన అంచనా నిజమైన సంబడం లో షాప్ వాడు.

"6 వేల ఉద్యోగం రావలంటే ఈ మాత్రం తప్పదు.." షాప్ ఆఖరి మెట్టు అంచున దిగి నించున్న మాకు సర్దిచెప్పాడు ప్రతాప్ గాడు.

"పోనీలేరా! ఒకసారి బ్లాక్ లొ కొన్నాం అనుకుందాం టికెట్లు" వత్తి అందించాడు రామయ్య గాడు

అలా మొదటి resume తయారయ్యింది. దాన్ని రెండు పైపులా తృప్తి గా తడిమి చూసుకున్నారు అందరూ

"దీనికే ఇంత ఆనందపడిపోతున్నాడు, రేపు ఏ optimaa వాడో, IMR వాడో ఆఫర్ ఇస్తే టపా కట్టేస్తాడేమో" చెప్పాడు రాధా గురించి రామయ్య గాడు.

"రేయ్!, పదండ్రా ఇంకా టై లు, shoe లు కొనాలి కొంత మంది, టైం లేదు" అంటూ తొందర పెట్టాడు టీం లీడ్ ప్రతాప్ గాడు

* * *

"ఎవరు మీరు?" బాండ్ మేళం లా, అంతా ఒకే రకం టై లు, shoe లు కట్టుకుని ఎదురుగా నిలబడ్డ

మమ్మల్ని ప్రశ్నించాడు ఒక ఆఫీసు ముందు గేట్ కీపర్.

"resume లా, అక్కడ బాక్స్ లో పడేసి వెళ్ళండి" చెప్పిందో రిసెప్షనిస్టు

"మేం ప్రాజెక్ట్లు ఎవరికీ ఇవ్వం, ఎవరిపీ చెయ్యం" చెప్పాడు చిరాగ్గా సిస్టమ్స్ కి బూజులు దులుపుతూ ఓ కొ-ఆర్డినేటర్

"అసలు, ప్రాజెక్ట్ అంటే ఏంటి, ఏం చెయ్యాలనుకుంటున్నారు?" కూచోపెట్టి అడిగాడు ఓ కంపెనీ MD .

"ఆటోమేట్ చేస్తాం సార్" చెప్పాం అందరం

"డైనమేట్ పేలుస్తాం" అన్నట్టు అనిపించిందో ఏమో అంతే,

"దేన్ని చేస్తారు" అడిగాడు ఆయన కంగారు పడి కుర్చీలోంచి లేస్తూ,

"ఇందాకటి జవాబు నచ్చినట్టు లేదు ఈయన కి అని, "ప్రోగ్రామింగ్ చేస్తాం సార్" అని ఒకడు, "కంప్యూటరైజ్డ్ చేస్తాం సార్" అని ఇంకోడు ఇష్టమొచ్చినట్టు అరవసాగాం.

"ఏదో చేస్తాం అంటున్నారే కాని, వీళ్ళు ఎలాంటి అఘాయిత్యం చేయ్యబోవటం లేదు ఇప్పుడు" అన్నది ఆయన రూడీ చేసుకున్నాక,

"ఇలాంటి పరిస్థితులలో నేను ప్రాజెక్ట్ అయితే ఇచ్చుకోలేను గాని, ఓ సలహా మాత్రం ఇవ్వగలను మీరు పుచ్చుకుంటానంటే" అన్నాడాయన మా వంక వేడుకోలు గా చూస్తూ

"చెప్పండి సార్!" అన్నట్టు తలలు వూపాం .

"మీరు ఏమైనా చెయ్యండి, ఎక్కడైనా చెయ్యండి, ఎప్పుడైనా చెయ్యండి, కాని మాట రాకుండా చెయ్యండి" అని చెప్పి చక్కా లేచి పోయాడు సీట్ లోంచి.

"మనల్ని తీసిపారేసాడు రా ఈయన" బాధపడిపోయాడు ప్రతాప్ గాడు ఇహ ప్రాజెక్ట్ రాదేమో అన్నంత దిగులు గా.

"నీ మొహం, ఏం చేసినా మాట రాకుండా చెయ్యండి అంటే, మీరు అరుస్తున్నారు గుంపు గా, అరవకుండా చెయ్యాలి ప్రాజెక్ట్ గుట్టు గా" అని అర్ధం లేరా ఊరడించాడు రామయ్య గాడు.

లంచ్ బ్రేక్ లో మళ్ళీ కలిసాడు "మాయదారి" మల్లి.

"ఏం పర్లేదు, Frontier, Softstar, Softpro, Indotronix, Kernex ఇంకా చాలా ఉన్నయ్, వచ్చేస్తుంది లే" ధైర్యం చెప్పాడు బిల్లు పే చేసి లిఫ్ట్ లోకి నడుస్తూ.

"ఏంటి వచ్చేది? గ్రౌండ్ ఫ్లోరా?" గొణిగాడు వేణు గాడు.

"అన్ని కంపెనీ లు గురించి చెపుతాడు కాని Sriven సంగతి మాత్రం తేల్చడు చూడు" సణిగాడు చెవిలో రామయ్య గాడు.

కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల ఆపరేషన్ కు పాంప్లెట్ లు పంచినట్టు, ప్రతి గుమ్మం ఎక్కుతూ, దిగుతూ resume లు పంచిపెట్టాం తర్వాత. దయగల ధర్మప్రభువులు ఒకళ్ళిద్దరు లోపల కి పిలిచి కొన్ని ప్రశ్నలు వేసి పంపించారు కనీసం.

"ఏంటి రామయ్యా! ధీర్ఘంగా ఆలోచిస్తున్నావ్? ప్రాజెక్టు కీ, ఉద్యోగాని కీ ఏం మంత్రం వేద్దామనా? కాస్త మాకు షారు చేద్దామని అడిగాడు వేణు గాడు

"ఇక్కడ నుండి ఎంత త్వర గా బయటపడదామా అని" చెప్పాడు వీడు.

"ఇందులో ఆలోచించడాని కి ఏముంది ఈసారి లోపలకెళ్ళకుండా వుంటే సరి" అన్నాడు వాడు.

"బాగా చెప్పావ్!, రేయ్, నేను OUT! కావల్సొస్తే మీరు వెళ్ళండి" అన్నాడు వీడు.

"రారా! ఏ కంపెనీ లో ఏ ప్రాజెక్టు వుందో ఎవరి కి తెలుసు? " అన్నాడు రాధా గాడు.

"ఏ థియేటర్ లో ఏ సినిమా వుందో చెప్పొచ్చు కాని ఇది కష్టం రా, ఇలా లాభం లేదు కాని, మా వూరి MLA చేత రికమండేషన్ తెప్పించైనా సరే CMC లోనో, ECIL లోనో, BHEL లోనో సంపాదిస్తా, వస్తా" అంటూ వెళ్ళిపోయాడు వడివడి గా అడుగులేసుకుంటూ విసిగెత్తిన రామయ్య గాడు.

"వస్తా అని ఇటు వెళ్ళాడేమిటి?" అడిగాడు అర్ధం కాని అశ్విన్.

"RTC X" రోడ్స్ వైపు, చెప్పా వాడి అంతిమ ధ్యేయం తెలిసిన నేను.

ఇక లాభం లేదని అందరం ఎవరి దారి వారు చూసుకున్నాం.

* * *

1 నెల తర్వాత..

వేణు గాడి కీ, అశ్విన్ కీ ప్రాజెక్టు లు CMC, DRDL లో దొరికినట్టు కబురందటం తో కలకలం మొదలయ్యింది.

"రేయ్! బాబాయ్ గారు ఫోన్ చేసారు , ECIL లో కంఫర్మ్ అయిందిట ప్రాజెక్టు" చెప్పారు నాన్న గారు.

"నాకు ఇంకా రాలేదు రా, బెంగుళూర్ లో ట్రయ్ చేసికుంటా, ప్రతాప్ గాడు వెళ్ళాడు గా ఆల్రెడీ Novasoft లోనో, IMR లోనో, ఛాన్స్ వుంది అని, చూస్తా ఏమన్నా వస్తుందేమో" అని రాధా వెళ్ళాడు.

Hyd చేరి పిన్నీ వాళ్ళింట్లో వుంటున్న నాకు ఒకరోజు ఫోన్ వచ్చింది........రామయ్య లైన్ లో.

"MLA నా మజాకా నా?" నేను వస్తున్నారా రేపటి నుండి..అన్నాడు ఆనందం గా.

చేరాం ఇద్దరం ECIL లో, కాకపోతే చెరో గ్రూప్.

రాధా కి బెంగుళూర్ లో కూడా పని అవ్వక Hyd చేరుకున్నడు మళ్ళీ.. ఎవరో తెలిసిన వాళ్ళు NRSI లొ ఇప్పిస్తాం అన్నారట. అలా దాని కోసం వెడితే, అక్కడ ఇప్పించలేకపోయినందుకు ఆ తెలుసున్నాయన అష్టకష్టాలు పడి ECIL లో ఇప్పించాడు.

ఉడికించడానికి రామయ్య గాడు "ఏరా! ఇది ECIL అనుకుంటున్నారా, అమితాబచ్చన్ ABCL అనుకుంటున్నారా, ప్రతోడు వచ్చెయ్యటమేనా?" అనే వాడు

ఓ 4,5 రోజులు గడిచిన తర్వాత..

"ఏరా!, వీడు సీట్లో లేడు ఎక్కడకెళ్ళాడు?" అడిగా

"గేట్లోంచి కాల్ వచ్చింది చూడ్డానికి వెళ్ళాడు" చెప్పాడు రామయ్య గాడు.

"అదేదో పెద్ద బిల్ గేట్స్ నుండి వచ్చినట్టు చెప్పావే, ECIL గేట్ కే అంత బిల్డప్ ఆ , పద చూసొద్దాం" అన్నా.

కాని అదే ECIL మా లాంటి వారి పాలిట "కామధేను-కల్పతరువు" లా వెలిసింది అన్న విషయం మాకు అప్పుడే అర్ధమయ్యింది తొలిసారి గా.

ఎదురుగుండా " కోఠి లో కొన్న టోపి తో, బేగంపేట్ లొ బేరమాడి కొన్న బూట్ల తో ", తూట్లు పొడిచేసినా, లేచి ఫైట్లు చేసే తెలుగు సినిమా హీరో లా నవ్వుతూ కనిపించాడు ప్రతాప్ గాడు.

చేతి లో మెర మెర మెరుస్తూ ఓ నీలి రంగు ఫైలు "భారత ప్రభుత్వ అంతరంగ..." అర్ధమైపోయింది.

రంగ రంగా!, వీడూ ఇక్కడికే దాపురించాడా?.." అంటూ నవ్వుతూ ఎదురెళ్ళాడు రామయ్య గాడు.

డబ్బులు ఎదురు కట్టి మరీ ప్రాజెక్టు చేసుకునే సౌకర్యం కూడా వుంది అన్న వార్త ఆధారం చేసికుని కోట లో కి జొరబడ్డాడు వాడు కూడా

ఇహ, అక్కడ నుండీ మొదలయ్యాయి సిసలు కష్టాలు అసలు ఉద్యోగాని కి.

వచ్చేవారం...

పార్థు

... Cont.

మీ సూచనలూ, సలహాలు రచయిత పార్థు కి తెలియచేయండి.
మీ అభి ప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి